పెట్టెలో ఎక్కడ వెతుక్కోను? ఇదన్నమాటనాకు బెర్తును ట్రాన్స్‌ఫర్ చేసిన వదినగారి ఆంతర్యం! పై బెర్తుమీద ఆ కుర్రాడు, క్రింద బెర్తుమీద ఆ అందాల భరిణ, వారి కువకువలు, బిలబిలలు, గిలగిలలు భరించలేక - వాళ్ళ తలాటి దిక్కుకు నా కాళ్ళు జాపి బరంపురం శాలువా ముఖం మీదకు లాక్కుని చపలచిత్తాన్ని జోకొట్టి నిద్ర లోకి జారా - రీ ఎలర్టు చేయడానికి యవ్వన విలాసం పర్మిషనివ్వదు కదా!

మరోసారి పట్టపగలే - ఈస్టుకోస్ట్ ఎక్స్‌ప్రెస్ ఎర్రచీవల పుట్టలా వుంది. అందులో యిద్దరు తగిలారు. వాళ్ళ కళ్ళల్లో మైకం చిందులేస్తోంది. బోగీ టి.టి.ఇ వాళ్ళకి సీటివ్వను పొమ్మన్నాడు. ఆ అభ్యంతరాన్ని వాళ్ళు శృంగార నైషధంగా మార్చుకున్నారు. కొంతసేపు ఒకరిమీదొకరు వాలిపోయి స్వర్గానందాన్ని పొందాక, యియర్ ఫోన్లు తగిలించుకుని పాటల్ని వింటూ, ఆ యిరుకు పెట్టెని 'బృందావన మది అందరిదీ' అన్నట్లు మార్చేశారు. అన్‌కన్‌సర్న్‌డ్‌గా వాళ్ళ ప్రపంచంలోకి వాళ్ళు వెళ్ళిపోవడం - 'చల్ మోహనరంగా' అన్నట్లుంది. కాని, అలా వెళ్ళగలిగే యోగం మనకెవరికీ పట్టదు. దానికి అదృష్టముండాలి! జైహింద్!

# వదినగారి ఒడ్డాణం

తెలుగువారికి 'కంటె'లాగ 'ఒడ్డాణం' కూడా చాలా యిష్టమైన నగ. కంటెల్లో గుల్లకంటె అని గట్టికంటె అని వున్నట్లు ఒడ్డాణాలలో వంకీల మువ్వల ఒడ్డాణం సాదారేకు ఒడ్డాణం అని రెండు రకాలున్నాయ్. అల్లాగే కాళ్ళకు కడియాలు గొలుసులు పట్టాలు అవి వుండేవి. చేతులకి మురుగులు మళ్లా కడియాలు ఆ తర్వాత రకరకాల గాజులు వచ్చాయి. ఒక పునిస్త్రీ ఆడబడుచు యింట్లో తిరుగుతూంటే గలగలమంటూ కలకల్లాడుతూ వుండాలని మనవాళ్ళ అభిలాష! మెళ్ళోకి చంద్రహారాలు, కంటె, కాసులపేర్లూ యింకా పగడాలు, జిగినీ గొలుసులూ, ముత్యాలహారాలు, చేతికి దండ కడియం యివన్నీ తెలుగింటి ఆడబడుచుకి (కలవారి కోడలు కలికి కామాక్షికి) వుండి తీరవలసిన జవ్వారీ జప్పరాను. పాపిడి పిందిరాలు చెవులకి కర్ణాభరణాలు పెక్కురకాలుండేవి. ఇవన్నీ గాకపోయినా మా అత్తయ్యగారికి యిందులో కొన్నయినా వుండేవి. ఒడ్డాణం మస్ట్ - అది వంకీల ఒడ్డాణం- ఆ ఒడ్డాణం పెట్టుకొని, ముఖాన పెద్ద కుంకమ బొట్టుతో -(ఏడుగజాల చీరలావిడ కట్టేవారు కాదు) తొమ్మిది గజాల చుట్టంచుజరీ చీరతో కచ్చా పోసి కట్టుకుని పెద్ద పమిటను ముందుకు లాగి ఆవిడ యింట్లో తిరుగుతూంటే మహాలక్ష్మి కళ నట్టింట నడయాడుతున్నట్లు ఉండేది.

ఆవిడ సంపదతో తరలివచ్చిన యిల్లాలు గనుక - ఆవిడది చాలా భారీ చెయ్యి. ఎవరికి ఏది కావాలని వచ్చిచేయి చాచినా లేదనేది లేదు. దానం, దయ, క్షమ, ప్రేమ, భక్తి

వీటన్నిటితోపాటు తీవ్రమైన బొగ్గుల్ని కడిగే మడి, ఆచారమూ ఆవిడకి వుండేవి. తెల్లారి మూడు నాలుగు గంటలకి లేచింది మొదలు రాత్రి పదకొండూ పన్నెండు గంటలదాకా చిమ్మెటలా ఏదో ఓ పనిచేస్తూ వుండేది. ఆవిడ మడికి దేవుళ్ళు గడగడ వణికేవారు. పనిమనుషులు అంట్లు తోమారనుకోండి. ఏ గరిటకో ఏ గిన్నెకో కాస్త అన్నం పక్కు అంటుకుని మిగిలిపోయి వుందనుకోండి. అప్పుడిక యిల్లూ వాకిలీ అంతా కడిగి శుద్ధి చేయాల్సిందే - శూద్దరవాళ్ళు అని పనిమనుషులు తోడిన నీళ్ళు పనికిరావు గనుక అన్ని నీళ్ళూ ఆమెగారే తోడుకునేది - లేదా యింట్లోని ఆడాళ్ళంతా నీళ్ళు తోడలేక నడుములు పీక్కుపోయేవి. నీళ్ళు తోడుకునే ముందు నూతి గట్టంతా కడగాల్సిందే - అంచాత మా అత్తయ్యగారి హయాంలో నీళ్ళ వాడకం విపరీతం - ఎన్ని గంగాళమ్ములు సరిపోయేవి కావు. ఇక పూజలూ వ్రతాలూ నోములూ వుద్యాపనలూ యన్నీ అన్నీ కావు. కేలండర్ లేదా పంచాంగంలో వున్న తిథులూ పండుగలూ ఉత్సవాలూ అన్నీ జరపాల్సిందే యివిగాకుండా పుట్టినరోజులూ, సమర్తలూ వగైరా వుండేవి. ఆదాయానికి ఖర్చులకీ పొంతన వుండేది కాదు. బట్టల కొట్లలో అప్పులు, పచారీకొట్లో అప్పులు, నూనెవాడికి నేతివాడికి అప్పులు, బంగారం కొట్లలో సరేసరి - యిలా 'అప్పుగొని చేయు విభవము'లా వుండేది. ఇంట్లో వారాలబ్బాయిలు, గెస్టులూ, కిత్తూ కిన్నూ వచ్చి వుండేవారు. ఎప్పుడూ 'హౌస్‌ఫుల్'గా 'చల్తీ కా నామ్ గాడీ' అన్నట్లుండేది. పురాణం శాస్త్రుల్లుగారొచ్చి పురాణం చెప్పి వెళ్ళేవాడు. సంగీతం మేష్టారొచ్చి ఆడపిల్లలకు సంగీతప్పాఠాలు చెప్పి వెళ్ళేవాడు. ఇద్దరు ప్యూనులూ యింకా ఒకరిద్దరు పనివాళ్ళు కుర్రాళ్ళు నలుగురైదుగురున్నా యింతమందికి చేతినిండా పని వుండేది. అయితే యిల్లంతా రణరంగం కానీ మా పెద్దమావయ్యగారు మాత్రం తామరాకు మీద నీటిబొట్టులా ఏదీ అంటీ ముట్టకుండా వుండేవారు. ఆయన ఒక ఐలండ్ - ఆయన ప్రపంచం ఆయన రూల్సు ఆయనవి.

ఆ రోజుల్లో మరుదుల్ని కూడా శ్రద్ధ తీసుకుని యీ వదినగారే చదువులూ సంజలూ పెళ్ళిళ్ళూ కార్యంకరమత్తులూ చూడాల్సివచ్చేది. ఆ మరుదులికి ఆ అన్న గారు ధర్మరాజే - వదినగారు సాక్షాత్తు సీతమ్మతల్లే - వాళ్ళ భక్తీ వాళ్ళ ప్రేమలు అలాంటివి. ఆ మరుదలందరికీ ఆ వదినగారు ఎంత చెబితే అంత.

అందులో ఓ మరిదికి పెళ్ళయాక, బియ్యే చదువు తూండగా కాస్త మతిస్థిరం తప్పింది. అతనికి వైద్యం కోసం ఆవిడ కృష్ణాజిల్లాలోని జిన్నూరో ఎక్కడికో తీసికెళ్ళింది. ఆ వైద్యం చాలా మొరటుగా వుండేది. గుండుకొట్టించి నిమ్మకాయ రసం పిండి బిందెలకు బిందెలు నీళ్ళు స్నానం చేయించేవార్ట.

ఆ మతిస్థిరం లేని మరిదిని పెట్టుకుని ఓ గదిలో పండుకుని తింటూ ఆవిడ యీ పిల్లాడితో నానాఅవస్థలూ పడిందిట. ఓసారి అన్నం తింటూ ఆ అన్నాన్ని వదినగారి మీద చిమ్మేసేవాడ్ట. ఆవిడ నెత్తిమీద కంచం బోర్లించేవాడ్ట. ఆవిడ అన్నం తింటూంటే వెళ్ళి విస్తట్లో నిలబడి చిందులు తొక్కేవాడ్ట! ఆవిడ ఏ స్నానానికో నీళ్ళకో కృష్ణకు వెళ్ళినపుడు కూడా తీసుకెళ్ళేదట.

ఆ వెర్రివాడు వదినగార్ని ఏడిపించాలని హరిజన వాడలోకి వెళ్ళి నిలబడి రాను రానని వదినగారిని బెదిరించేవాడట. ఆ హరిజనవాడలోకి వదినగారు రాదని ఆ మతిలేని పిల్లాడికి తెలుసు. ఇలా ఆ మరిదితో నానాబాధలూ పడ్డాక అతనికి సడన్‌గా ఓ రోజు ఆ జబ్బు అంతా మాయమయి మామూలు మనిషిలా చాలా వినయంగా భక్తిగా వదినగారికి కనిపించేసరికి ఆ తల్లి గోదావరిలా మహా పొంగిపోయింది.

అప్పుడు ఆ మరిది అడిగాడ్ట 'వదినా వదినా నీ ఒడ్డాణ్ణం ఏది?' అని. తాకట్టు పెట్టామని ఆవిడ చెప్పిందట. ఎందుకని మరిది రుకాయిస్తే నీకెందుకు నాయినా యివన్నీ అని ఆవిడ నవ్విందట.

తమ చదువుల కోసం రోగాల కోసం సంసారఖర్చుల కోసం వదినగారు ఒడ్డాణ్ణాన్ని తాకట్టు పెట్టేసిందని చిన్నమరిదికి కష్టం తోచింది. ఒడ్డాణ్ణం పెట్టుకోకపోతే వదిన మా వదిన కాదు అనుకునేవాడు ఆ మరిది. ఆ ఒడ్డాణ్ణమే గాకుండా చంద్రహారం చేతిగాజులు కూడా తాకట్టుకి వెళ్ళిపోయాయని తెలిసింది.

ఆ యింట్లో ఏ కష్టం వచ్చినా ఏ మంచి వచ్చినా వదినగారి ఒడ్డాణ్ణంతో సహా అన్నీ తాకట్లోకి వెళ్ళిపోయేవి.

బ్యాంకుల్నించి నోటీసులు వస్తే అవి పెద్దన్నగారి కంటబడకుండా దాచేది. 'ఇన్ని అప్పులా' అని ఆయన ఎక్కడ మతిపోగొట్టుకుంటారోనని ఆవిడ ఆయన కేమీ తెలియనిచ్చేదికాదు.

అయితే ఓసారి బ్యాంకువాళ్ళు ఆయన్ను ఆఫీసులో కలిసి ఒడ్డాణ్ణం విడిపించుకోకపోతే వేలం వేస్తామని అన్నార్ట. అప్పుడాయన ఆవిడ్ని పిలిచి 'నువ్వు దొంగవి' అని తిట్టార్ట. దానికి అభిమానం వచ్చి మా పెద్దత్తయ్యగారు ఆ ఒడ్డాణ్ణాన్ని అమ్మేసి అప్పులన్నీ తీర్చేసిందిట.

తాకట్టు పెట్టడం వేరు అమ్మడం వేరు. మరుదులంతా వదినగారికి మళ్ళీ ఒడ్డాణ్ణం చేయించి పెట్టాలని తీవ్రంగా ప్రయత్నించారు.

కాని, అలాటి శ్రీమహాలక్ష్మి లాటి వదినగారికి మళ్ళీ ఒడ్డాణ్ణం చేయించడం సాధ్యమా?

అదంతా ఓ జరగని కథ! ఎవరి పెళ్ళాం పిల్లలు వచ్చాక ఎవరి కథలు వారివి. అయితే కుటుంబాల్లో కూడా త్యాగాలు వృథా పోవు!

# 'శని'మాలు

మన్ని నవ్వించే వాళ్ళని మనం మర్చిపోతాం – మనల్ని యిబ్బంది పెట్టేవాళ్ళని మాత్రం గుర్తుంచుకుంటాం. వెన్నెల్లో చేసిన షికార్లు, చల్లగాలిలో పాడుకున్న పాటలు, వానలో తడుస్తూ పరుగులెత్తిన రోజులు, ఎండల్లో వీథుల్లో తిరగడాలు, తలుపులన్నీ మూసీ చీకటి చేసేసుకుని మంచంమీద ముడిచిపెట్టుకుని పడుకున్న సమయాలు, అన్నాలు తింటూ కబుర్లు చెప్పుగుంటూ